సఫారీ సవాల్

నేడు భారత్, దక్షిణాఫ్రికా తొలి టీ20 మ్యాచ్

- యువ ఆటగాళ్లకు పరీక్ష
- రాత్రి 7.30 నుంచి..

వన్డే ప్రపంచకప్ ఫైనల్ ఓటమి నుంచి తేరుకొని స్వదేశంలో ఆస్ట్రేలియాపై టీ20 సిరీస్ నెగ్గిన టీమ్ఇండియా.. నేటి నుంచి దక్షిణాఫ్రికాలో పర్యటించనుంది. ఈ టూర్‌లో భాగంగా మూడు ఫార్మాట్లలో సఫారీలతో తలపడనున్న భారత్.. మొదట టీ20లతో వేట షురూ చేయనుంది. వచ్చే ఏడాది జరగనున్న పొట్టి ప్రపంచకప్‌నకు ముందు టీమ్ఇండియా కేవలం ఆరు మ్యాచ్‌లు మాత్రమే ఆడనుండటంతో.. యువ ఆటగాళ్లకు ఇది కఠిన పరీక్ష కానుంది!

ఇతర దేశాలతో పోలిస్తే.. దక్షిణాఫ్రికా పిచ్‌లు పేస్‌కు మరింత అనుకూలించనున్న నేపథ్యంలో.. యువ ఆటగాళ్లతో కూడిన భారత జట్టు ఎలాంటి ప్రదర్శన చేస్తుందనేది ఆసక్తికరం! సీనియర్లు రోహిత్, కోహ్లీ, రాహుల్ గైర్హాజరీలో పొట్టి ఫార్మాట్‌కు సూర్యకుమార్ సారథ్యం వహిస్తుండగా.. యంగ్ గన్స్ యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్, రింకూసింగ్, జితేశ్ శర్మపై అందరి దృష్టి నిలువనుంది!

డర్బన్: సొంతగడ్డపై కంగారూలను చిత్తు చేసి టీ20 సిరీస్ చేజిక్కించుకున్న యువభారత జట్టు.. సఫారీ పర్యటనకు సిద్ధమైంది. సుదీర్ఘంగా సాగనున్న ఈ టూర్‌లో ఆదివారం దక్షిణాఫ్రికాతో టీమ్ఇండియా తొలి టీ20 మ్యాచ్ ఆడనుంది. వచ్చే ఏడాది అమెరికా వేదికగా పొట్టి ప్రపంచకప్ జరుగనున్న నేపథ్యంలో.. అందులో చోటు దక్కించుకునేందుకు యువ ఆటగాళ్లకు మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్ చక్కటి అవకాశం కానుంది. నిరుడు టీ20 ప్రపంచకప్ ముగిసిన ప్పటి నుంచి పొట్టి ఫార్మాట్‌కు దూరంగా ఉంటున్న రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీతో పాటు కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా, జస్ప్రీత్ బుమ్రా ఈ సిరీస్‌కు అందుబాటులో లేకపోగా.. సూర్యకుమార్ జట్టును నడిపించనున్నాడు. ఇతర దేశాలతో పోల్చుకుంటే భిన్నంగా ఉండే.. దక్షిణాఫ్రికా పిచ్‌లపై పెద్దగా అనుభవం లేని యువ ఆటగాళ్లు ఎలాంటి ప్రదర్శన కనబరుస్తారో చూడాలి. అయితే పొట్టి ఫార్మాట్‌లో సఫారీలపై మన రికార్డు మెరుగ్గా ఉండటం జట్టు ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తున్నది. మరోవైపు దక్షిణాఫ్రికా జట్టు కూడా యువ ఆటగాళ్లకు ఎక్కువ అవకాశాలు కల్పించింది. రెగ్యులర్ కెప్టెన్ బవుమాకు ఈ సిరీస్ నుంచి విశ్రాంతినివ్వగా.. మార్క్‌రమ్ జట్టు పగ్గాలు చేపట్టనున్నాడు. దక్షిణాఫ్రికాకు మార్క్‌రమ్, హెన్రిక్స్, క్లాసెన్, మిల్లర్, జాన్సన్ రూపంలో ప్రమాదకర బ్యాటర్లతో పాటు.. కేశవ్ మహరాజ్, తబ్రేజ్ షంసీ రూపంలో నాణ్యమైన స్పిన్నర్లు అందుబాటులో ఉన్నారు. ఇక సొంతగడ్డపై సఫారీ పేసర్లను ఎదుర్కోవడం భారత ఆటగాళ్లకు శక్తికి మించిన పనే!

కూర్పు కష్టమే!

ఈ పర్యటన కోసం మూడు వేర్వేరు జట్లను ప్రకటించిన భారత జట్టు.. పొట్టి సిరీస్‌కు ఎక్కువగా యువ ఆటగాళ్లను ఎంపిక చేసింది. టీ20 సిరీస్ కోసం 17 మందిని ఎంపిక చేయగా.. ఇందులో శ్రేయస్, ముఖేశ్, ఇషాన్ మాత్రమే వన్డే సిరీస్‌లో పాల్గొననున్నారు. వచ్చే ఏడాది జరగనున్న వరల్డ్‌కప్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ సిరీస్ ప్రదర్శనను పరిగణనలోకి తీసుకుంటారని అంతా భావిస్తున్నారు. ఓపెనర్లుగా యశస్వి, రుతురాజ్‌ను కొనసాగిస్తారా లేక శుభ్‌మన్ గిల్ కోసం ఒకరిని తప్పిస్తారా చూడాలి. ఇక మూడో స్థానంలో శ్రేయస్ అయ్యర్, ఆ తర్వాత సూర్య, రింకూసింగ్, జితేశ్ శర్మ, జడేజా బ్యాటింగ్‌కు రానున్నారు. వికెట్ కీపర్‌గా ఇషాన్ కంటే.. జితేశ్‌కే ఎక్కువ అవకాశాలున్నాయి. ఇక నయా ఫినిషర్‌గా గుర్తింపు తెచ్చుకుంటున్న రింకూసింగ్‌కు సఫారీ పిచ్‌లపై అసలైన సవాల్ ఎదురుకానుంది. బౌలింగ్‌లో సిరాజ్, కుల్దీప్, జడేజా రాకతో వైవిధ్యం పెరగగా.. ఆస్ట్రేలియాపై ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన రవిబిష్ణోయ్‌కు తుది జట్టులో చోటు దక్కుతుందో లేదో చూడాలి.

8 గత ఎనిమిదేండ్లలో దక్షిణాఫ్రికా చేతిలో టీమ్ఇండియా టీ20 సిరీస్ కోల్పోలేదు. చివరిసారిగా 2015లో భారత్‌పై సఫారీ జట్టు పొట్టి సిరీస్ గెలిచింది.

> యువ ఆటగాళ్లు మంచి జోరు మీదున్నారు. రింకూ, జితేశ్‌లో నిరూపించుకోవాలనే కసి ఉంది. ఇది శుభపరిణామం. విదేశీ పర్యటన అంటే కఠిన పిచ్‌లు ఎదురవడం మామూలే. క్లిష్ట పరిస్థితులను ఎలా ఎదుర్కొంటామనేది ముఖ్యం. అయితే ఇలాంటి పిచ్‌లపై ఆడిన అనుభవం మా ఆటగాళ్లకు ఉంది. జట్టులో ప్రతి ఒక్కరికీ వారి బాధ్యతలేంటో తెలుసు. సమిష్టిగా సత్తాచాటి సిరీస్ నెగ్గాలనే లక్ష్యంతో బరిలోకి దిగనున్నాం.
>
> –సూర్యకుమార్, భారత కెప్టెన్

తుది జట్లు (అంచనా)

భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), యశస్వి, రుతురాజ్/గిల్, శ్రేయస్, రింకూసింగ్, జితేశ్, జడేజా, దీపక్ చాహర్, కుల్దీప్/రవి, సిరాజ్, ముఖేశ్.

దక్షిణాఫ్రికా: మార్క్‌రమ్ (కెప్టెన్), హెన్రిక్స్, బ్రీట్జ్, క్లాసెన్, మిల్లర్, ఫెరీరా, జాన్సన్, కేశవ్, కోట్జీ, బర్గర్, షంసీ.

పిచ్, వాతావరణం

దక్షిణాఫ్రికాలో ప్రస్తుతం వేసవి కాలం ప్రారంభమైంది. మ్యాచ్‌కు వర్షం ముప్పు లేదు. గతంతో పోలిస్తే పిచ్ కాస్త నెమ్మదించింది. ఇక్కడ జరిగిన గత మూడు మ్యాచ్‌ల్లో తొలి ఇన్నింగ్స్‌లో 190 పైచిలుకు పరుగులు నమోదయ్యాయి. నిలదొక్కుకుంటే భారీ స్కోర్లు సాధ్యమే.

ఫైనల్లో అశ్విని జోడి

గువాహటి: భారత మహిళల డబుల్స్ జోడి అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో గువాహటి మాస్టర్స్ సూపర్100 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్‌లో టైటిల్ పోరుకు చేరుకున్నారు. గత వారం ముగిసిన సయ్యద్ మోడి స్మారక టోర్నీలో రన్నర్స్‌గా నిలిచిన ఈ జోడి ఇక్కడ మూడో సీడ్ నెదర్లాండ్స్‌కు చెందిన డెబొరా జిల్, చెరిల్ సీనెన్‌లపై 36 నిమిషాలలో 21-12, 21-12 స్కోరుతో గెలుపొందారు. ఫైనల్లో భారత జోడి తైవాన్‌కు చెందిన సంగ్ షో యున్-యు చీన్ హుయితో ఆదివారం తలపడతారు. మహిళల సింగిల్స్‌లో మాళవిక బన్సోద్, మిక్స్‌డ్ డబుల్స్‌లో తనీషా-ధ్రువ కపిల ఫైనల్స్‌కు చేరుకోవడంలో విఫలమయ్యారు.

క్వార్టర్స్‌కు భారత్

కౌలాలంపూర్: పురుషుల జూనియర్ ప్రపంచకప్ హాకీ టోర్నీలో భారత జట్టు క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకుంది. శనివారం జరిగిన మ్యాచ్‌లో కెనడాను 10-1తో చిత్తుగా ఓడించిన భారత్ పూల్‌లో రెండో స్థానంలో నిలిచి క్వార్టర్స్ బెర్త్ ఖాయం చేసుకుంది.ఆదిత్య (8ని.,43ని.), రోహిత్(12ని., 55ని.), అమన్‌దీప్ లక్ర(23ని., 52ని.), విష్ణుకాంత్(42ని.) గోల్స్ చేశారు.

21న రెజ్లింగ్ సమాఖ్య ఎన్నికలు

న్యూఢిల్లీ: ఎట్టకేలకు భారత రెజ్లింగ్ సమాఖ్య ఎన్నికలు ఈనెల 21న జరుగనున్నాయి. ఈ మేరకు రిటర్నింగ్ అధికారి రిటైర్డ్ జస్టిస్ ఎం.ఎం.కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికలపై పంజాబ్-హర్యానా హైకోర్టు విధించిన స్టే ఆర్డర్‌ను సుప్రీంకోర్టు ఎత్తివేయడంతో ఎన్నికల నిర్వహణకు అవకాశం ఏర్పడింది.

వచ్చే ఏడాది జరుగనున్న ప్రతిష్ఠాత్మక పారిస్ ఒలింపిక్స్ సన్నద్ధత కోసం శనివారం హైదరాబాద్‌లో రెండు కోట్ల నగదు ప్రోత్సాహకాన్ని బాక్సర్ నిఖత్ జరీన్‌కు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

కో..అంటే కోటి

- కాశ్వి గౌతమ్‌కు రెండు కోట్లు
- వృందా దినేశ్‌కు 1.3 కోట్లు
- గుజరాత్‌కు హైదరాబాదీ త్రిష
- ముగిసిన డబ్ల్యూపీఎల్ వేలం

మహిళల ఐపీఎల్ క్రేజ్ ఏంటో మరోమారు తెలిసొచ్చింది. రానున్న రెండో సీజన్ కోసం ఫ్రాంచైజీలు కోట్లు కుమ్మరించాయి. మెరికల్లాంటి క్రికెటర్లను ఎంచుకునేందుకు జట్లన్నీ వేలంలో హోరాహోరీగా తలపడ్డాయి. పంజాబ్ యువ పేసర్ కాశ్వి గౌతమ్ జాక్‌పాట్ కొట్టింది. గుజరాత్ జెయింట్స్ జట్టు కాశ్విని రికార్డు స్థాయిలో రెండు కోట్లకు తీసుకోగా, వృందా దినేశ్‌ను 1.3 కోట్లతో యూపీ వారియర్స్ దక్కించుకుంది. నిలకడగా రాణిస్తున్న హైదరాబాదీ యువ క్రికెటర్ త్రిషా పూజితను గుజరాత్ పది లక్షలకు సొంతం చేసుకుంది.

ముంబై: డబ్ల్యూపీఎల్ రెండో సీజన్ కోసం శనివారం వేలంపాట ఆసక్తికరంగా సాగింది. మొత్తం 30 బెర్తుల కోసం ఐదు ఫ్రాంచైజీలు తమదైన ప్రణాళికతో బరిలోకి దిగాయి. దేశవాళీ టోర్నీల్లో నిలకడగా రాణిస్తున్న పంజాబ్ యువ పేసర్ కాశ్వి గౌతమ్‌పై కనకవర్షం కురిసింది. ప్రస్తుతం భారత 'ఎ' జట్టులో సభ్యురాలైన కాశ్వి కనీస ధర రూ.10 లక్షలతో వేలంలోకి ప్రవేశించింది. తొలుత గుజరాత్ జెయింట్స్, యూపీ వారియర్స్..కాశ్విని సొంతం చేసుకునే తీవ్రంగా పోటీపడ్డాయి. చివరకు గుజరాత్ రెండు కోట్లు వెచ్చించి ఈ 20 ఏండ్ల పంజాబ్ పేసర్‌ను తమ జట్టులోకి తీసుకుంది. కాశ్వి సహచర క్రికెటర్ కర్ణాటకకు చెందిన వృందా దినేశ్‌ను యూపీ వారియర్స్ రూ.1.3 కోట్లకు కొనుగోలు చేసింది ఈ ఇద్దరు అన్‌క్యాప్‌డ్ ప్లేయర్లు వేలంలో ఊహించని ధర పలికారు.

గుజరాత్‌కు త్రిష

హైదరాబాద్ యువ క్రికెటర్ త్రిషా పూజితను గుజరాత్ జెయింట్స్ కనీస ధర రూ.10 లక్షలకు సొంతం చేసుకుంది. కోల్‌కతాలో ప్రస్తుతం మహిళల అండర్-23 టీ20 టోర్నీ ఆడుతున్న త్రిష..డబ్ల్యూపీఎల్‌లో భాగం కాబోతున్నందుకు గర్వంగా ఉందని పేర్కొంది. అంతర్జాతీయ స్థాయి క్రికెటర్లతో కలిసి ఆడేందుకు ఆతృతగా ఎదురుచూస్తున్నానని తెలిపింది. వేలంలో పోటీకి దిగిన తొలిసారే ఎంపిక కావడం సంతోషంగా ఉందని చెప్పుకొచ్చింది.

ఆదర్శ్, కార్తికేయ ముందంజ

- జాతీయ చెస్ చాంపియన్‌షిప్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: సికింద్రాబాద్ సౌత్ సెంట్రల్ రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్ వేదికగా జరుగుతున్న 36వ జాతీయ చెస్ అండర్-13 బాలబాలికల చాంపియన్‌షిప్‌లో ఉప్పాల శ్రీరామ్ ఆదర్శ్, విహాన్ కార్తికేయ, శివాంశిక ముందంజ వేశారు. శనివారం జరిగిన వేర్వేరు గేమ్‌లో వీరు విజయాలు సొంతం చేసుకున్నారు. శ్రీరామ్ ఆదర్శ్ కర్ణాటకకు చెందిన సిద్ధాంత్ పూజపై గెలువగా, విహాన్ కార్తికేయ..శౌనక్ చందాను ఓడించాడు. కార్తికేయ వర్మ..శ్రేయాస్ రాజ్(ఉత్తరప్రదేశ్)తో గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. మరోవైపు బాలికల విభాగంలో క్రితిక..ఆద్య గుప్తా(ఢిల్లీ)తో గేమ్‌ను డ్రా చేసుకుంది.

ఏడాదికి 6వేల మ్యాచ్‌లు

- జోనల్ క్రికెట్ పునరుద్ధరణ
- హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: పుష్కరకాలంగా నిలిచిపోయిన జోనల్ క్రికెట్‌ను పునరుద్ధరించేందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) నూతన కార్యవర్గం సిద్ధమైందని అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్‌రావు అన్నారు. శనివారం జింఖానా మైదానంలో పురుషుల సీనియర్ జోనల్ టోర్నీలో సికింద్రాబాద్ ఎలెవన్, సెక్రెటరీ ఎలెవన్ జట్ల మధ్య మ్యాచ్‌ను టాస్ వేసి ప్రారంభించారు. అంతకుముందు ఇరు జట్ల ప్లేయర్లను జగన్ పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఏడాది పొడవునా క్రికెటర్లు ఖాళీ లేకుండా టోర్నీలు నిర్వహిస్తాం. త్వరలో జూనియర్ స్థాయిలోనూ జోనల్ టోర్నీలు ఏర్పాటు చేస్తాం. ఏడాదికి ఆరు వేల మ్యాచ్‌ల నిర్వహణకు కసరత్తు చేస్తున్నాం. ఇందుకోసం కొత్త మైదానాలను సిద్ధం చేస్తున్నాం. హెచ్‌సీఏను హైదరాబాద్ వరకే పరిమితం చేయకుండా..మిగతా జిల్లాల్లోనూ క్రికెట్‌ను అభివృద్ధి చేస్తాం. అన్ని జట్లలో 50శాతానికి పైగా గ్రామీణ క్రికెటర్లకు అవకాశం దక్కేలా చూస్తాం. మాజీ క్రికెటర్ల సలహాలు, సూచనలతో హెచ్‌సీఏకు పునర్ వైభవం తీసుకొస్తాం' అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో సునీల్, ఎక్సలెన్సీ డైరెక్టర్ విజయ మోహన్, వివేక్ జయసింహా, క్యురేటర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సిరీస్ పాయే!

రెండో టీ20లో భారత మహిళల ఓటమి

ముంబై: భారత మహిళల జట్టు వరుసగా రెండో పరాజయంతో టీ20 సిరీస్ కోల్పోయింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శనివారం జరిగిన రెండో పోరులో మన అమ్మాయిలు.. ఇంగ్లండ్ చేతిలో 4 వికెట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. దీంతో ఇంగ్లిష్ జట్టు మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0తో సిరీస్ కైవసం చేసుకుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ 16.2 ఓవర్లలో 80 పరుగులకు ఆలౌటైంది. జెమీమా రోడ్రిగ్స్ (30) టాప్ స్కోరర్ కాగా.. మిగిలిన వాళ్లంతా విఫలమయ్యారు. షఫాలీ వర్మ (0), స్మృతి మంధన (10), హర్మన్‌ప్రీత్ (9), దీప్తి (0), రిచ (4), పూజ (6) ఒకరి వెంట ఒకరు పెవిలియన్‌కు చేరారు. అనంతరం ఇంగ్లండ్ 11.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 82 పరుగులు చేసింది. దీప్తి, రేణుక చెరో 2 వికెట్లు తీసి ఇంగ్లిష్ టీమ్‌పై ఒత్తిడి పెంచినా.. లక్ష్యం చిన్నది కావడంతో సునాయాసంగా గెలిచింది.

వాణిజ్య

బీపీసీఎల్‌తో టాటా ప్యాసింజర్ జట్టు

ముంబై, డిసెంబర్ 9: దేశవ్యాప్తంగా ఈవీ చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వరంగ ఇంధన విక్రయ సంస్థ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్)తో టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ లిమిటెడ్ జట్టుకట్టింది. ఇరు సంస్థల మధ్య కుదిరిన ఒప్పందంతో దేశీయంగా 7 వేల చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయబోతున్నాయి. దేశీయ రోడ్లపై టాటాకు చెందిన 1.15 లక్షల ఈవీ వాహనాలు తిరుగుతుండటంతో వీటికి చార్జింగ్ సదుపాయాలు కల్పించాలనే ఉద్దేశంతో బీపీసీఎల్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్టు కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్ కుమార్ తెలిపారు. దేశవ్యాప్తంగా బీపీసీఎల్‌కు ఉన్న 21 వేల పెట్రోల్ బంకుల్లో మూడో వంతు 7 వేల స్టేషన్లలో చార్జింగ్ సదుపాయాలను వచ్చే ఏడాదిలోగా అందుబాటులోకి రానున్నాయి.

సరికొత్త అపాచీ బైకు

ధర రూ.1.34 లక్షలు

చెన్నై, డిసెంబర్ 9: ప్రముఖ వాహన సంస్థ టీవీఎస్ మోటర్..దేశీయ మార్కెట్లోకి సరికొత్త అపాచీ 160 4వీ మోటార్‌సైకిల్‌ను పరిచయం చేసింది. డ్యూయల్ చానెల్ ఏబీఎస్, వాయిస్ అసిస్ట్ కలిగిన ఈ బైకు ధరను రూ.1,34,990గా నిర్ణయించింది. ఈ ధరలు తమిళనాడు షోరూంకు సంబంధించినవి. ప్రస్తుత పండుగ సీజన్‌లో సంస్థ విడుదల చేసిన మూడో మాడల్ ఇది కావడం విశేషం.

ఆఫర్లే.. ఆఫర్లు

కార్లపై 2 లక్షల వరకు రాయితీ ఇస్తున్న సంస్థలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 9: నూతన సంవత్సరంలో కార్ల కొనుగోలుదారులకు షాకిచ్చిన ఆటోమొబైల్ సంస్థలు..ఈ నెలలో మాత్రం భారీగా రాయితీలు ప్రకటించాయి. ఏడాది చివర్లో విక్రయాలు అంతంత మాత్రంగానే ఉంటాయన్న అంచనాతో ఆటోమొబైల్ సంస్థలు కస్టమర్లను ఆకట్టుకోవడానికి డిస్కౌంట్లను తెరపైకి తీసుకొచ్చాయి. ఈ ఏడాది కూడా దేశీయ ఆటోమొబైల్ దిగ్గజాలైన మారుతి సుజుకీ, హ్యుందాయ్, మహీంద్రా, ఫోక్స్‌వ్యాగన్‌తోపాటు ఇతర సంస్థలు భారీగా రాయితీలు ప్రకటించాయి.

పాత స్టాక్‌ను వదిలించుకోవడానికే..

ఆటోమొబైల్ సంస్థలు తమ వద్ద ఉన్న పాత స్టాక్స్‌ను వదిలించుకోవాలనే ఉద్దేశంతో పలు మాడళ్లను తక్కువ ధరకే విక్రయిస్తున్నాయి. దీంట్లో భాగంగా సంస్థలు రూ.2 లక్షల వరకు తక్కువ ధరకే ఆయా మాడళ్లను అమ్ముతున్నాయి. ఈ రాయితీలు ఈ నెల చివరి వరకు మాత్రమే అందుబాటులో ఉండనున్నాయని కంపెనీలు పేర్కొంటున్నాయి.

జనవరిలో వాత తప్పదు..

డిసెంబర్‌లో తక్కువ ధరకే వాహనాలను విక్రయిస్తున్న సంస్థలు..ఆ మరుసటి నెల కొత్త సంవత్సరం తొలి నెల జనవరిలోనే వాహన ధరలను పెంచుతున్నట్టు ఇదివరకే ప్రకటించాయి. దీంతో కొనుగోలుదారులు ఈ నెలలోనే తమకు నచ్చిన వాహనాన్ని తక్కువ ధరకే దక్కించుకోవచ్చును. ఇంచుమించు అన్ని సంస్థలు తమ మాడళ్ల ధరలను పెంచుతున్నట్టు ఇదివరకే ప్రకటించాయి కూడా.

మారుతి సుజకీ రాయితీ ఇస్తున్న మాడళ్లు ఇవే..

- ఐదు డోర్లు కలిగిన జిమ్నీపై రూ.2.21 లక్షల వరకు రాయితీ ఇస్తున్నది.
- ఫ్రాంక్స్ ఎస్‌యూవీపై రూ.25 వేల వరకు డిస్కౌంట్. వీటిలో రూ.15 వేలు నగదు రాయితీ ఇస్తున్న సంస్థ..మరో రూ.10 వేలు ఎక్స్ఛేంజ్ బోనస్
- హ్యాచ్‌బ్యాక్ బాలెనోపై రూ.30 వేలు నగదు డిస్కౌంట్‌తోపాటు 10 వేలు ఎక్స్ఛేంజ్ బోనస్
- గ్రాండ్ విటారాపై రూ.15 వేలు నగదు రాయితీ, ఇగ్నిస్‌పై రూ.40 వేల నగదు రాయితీ, అదనంగా ఎక్స్ఛేంజ్ బోనస్ కింద మరో రూ.15 వేలు

హ్యుందాయ్..

- గ్రాండ్ ఐ10 నియోపై రూ.45 వేల వరకు ప్రయోజనాలు కల్పిస్తున్నది. వీటిలో రూ.35 వేల వరకు నగదు రాయితీ, ఎక్స్ఛేంజ్ బోనస్ కింద రూ.10 వేలు
- ప్రజాదరణ పొందిన ఐ20, ఐ20 ఎన్-లైన్ హ్యాచ్‌బ్యాక్‌పై రూ.50 వేల వరకు
- ఐ20 ఎన్-లైన్‌పై రూ.50 వేల వరకు నగదు డిస్కౌంట్, టస్కన్ ఎస్‌యూవీపై రూ.1.5 లక్షల వరకు నగదు డిస్కౌంట్

మహీంద్రా..

- మహీంద్రా ఎక్స్‌యూవీ 400 ఎలక్ట్రిక్ మాడల్‌పై భారీ డిస్కౌంట్ 4.2 లక్షల వరకు కల్పిస్తున్నది.
- ఎక్స్‌యూవీ 300 టాప్-ఎండ్ మాడల్‌పై రూ.1.78 లక్షల వరకు రాయితీ

ఫోక్స్‌వ్యాగన్..

- ప్రీమియం టైగూన్‌పై నగదు డిస్కౌంట్, ఎక్స్ఛేంజ్ బోనస్, సర్వీస్ ప్యాకేజింగ్ కింద రూ.4.2 లక్షల వరకు కల్పిస్తున్నది.
- వర్చస్ సెడాన్‌పై రూ.50 వేల నగదు రాయితీ కలుపుకొని ఎక్స్ఛేంజ్ బోనస్ కింద రూ.20 వేలు, కార్పొరేట్ డిస్కౌంట్ కింద రూ.17 వేలు కలుపుకొని మొత్తంగా రూ.1.17 లక్షలు రాయితీ ఇస్తున్నది.

హోండా కూడా..

మరో కార్ల సంస్థ హోండా కూడా పలు మాడళ్లపై రాయితీని ప్రకటించింది. అమేజ్‌పై రూ.77 వేల రాయితీని ప్రకటించిన సంస్థ..సిటీపై లక్ష రూపాయల వరకు ప్రత్యేక రాయితీని ఇస్తున్నది.

ఎంజీ మోటర్

- ఎంజీ అస్టార్‌పై రూ.1 లక్ష వరకు ప్రయోజనాలు, ఎక్స్ఛేంజ్ కింద రూ.50 వేలు
- ప్రీమియం ఎస్‌యూవీ గ్లోస్టర్‌పై లక్ష రూపాయల వరకు ప్రయోజనాలు



Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.